జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 50 2-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com


Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం

- అమెరికా, ఇస్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి
- ఒకేసారి 48 మంది ఇరాన్ అగ్రనేతలను అంతం చేశామన్న ట్రంప్
- ఇస్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి దాడుల పరంపర
- భారత్ నుంచి వెళ్లే 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు రద్దు

2లో




## న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే.. ప్రజలకు సరైన న్యాయ జరుగుతుంది!

- తిరుపతిలో కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన శుభసూచికం
- నూతనంగా వచ్చే న్యాయవాదులు మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారు
- న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే ప్రజలకు సరైన న్యాయ జరుగుతుంది

# మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...

## తెలుగువారికి సీఎం రేవంత్ రెడ్డి సూచన

- గల్ఫ్ దేశాల్లోని తెలుగువారు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ సూచన
- ఎంబసీల మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పాటించాలని పిలుపు
- బహ్రెయిన్‌లోని తెలుగువారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఏపీ స్పీకర్ అయ్యన్న
- అవసరమైతే కేంద్రంతో మాట్లాడి క్షేమంగా రప్పిస్తామని హామీ



గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. యుద్ధ మేఘాలు అలుముకుంటున్న వేళ.. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇరాన్‌తో పాటు ఇతర గల్ఫ్ దేశాల్లోని పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అక్కడి తెలుగువారు భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే హెచ్చరికలు, భద్రతా సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే.. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని పౌరులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు రాష్ట్ర యంత్రాంగం

2లో




# దేశానికే ఆదర్శంగా అమరావతి జస్టిస్ సిటీ

## విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు

- ముఖ్య అతిథిగా హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- జస్టిస్ సిటీలో అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తామన్న సీఎం
- న్యాయ వ్యవస్థకు అవసరమైన భూములు ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటన
- అమరావతిని బ్లూ గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడి

అమరావతిలో నిర్మిస్తున్న జస్టిస్ సిటీని దేశంలోనే అత్యుత్తమ మోడల్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడ వేదికగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ అథార్టీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా జుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథార్టీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా

- మిగతా 2వ పేజీలో



## డీసీసీల అధ్యక్షులకు నేడు రాహుల్ క్లాస్

- సంస్థాగత నిర్మాణం, పార్టీ ఆలోచనల గురించి దిశానిర్దేశం
- మాటామంతితో పాటు ఫొటో సెషన్లలో పాల్గొననున్న కాంగ్రెస్ అగ్రనేత
- నేడు అనంతగిరిలో తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు
- హాజరుకానున్న రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

2లో

# గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ

- ఢిల్లీకి రాగానే అత్యవసరంగా సమావేశం కానున్న ప్రధాని మోదీ
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సీసీఎస్ భేటీ
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి వార్తలతో పెరిగిన ఆందోళన
- రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక మంత్రులతో కీలక సమీక్ష

## అవి డీప్‌ఫేక్ వీడియోలు... ఇది వైసీపీ వాళ్ల పనే!

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫైర్
- సోషల్ మీడియాలో తనపై డీప్‌ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి
- టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- దీని వెనుక వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం
- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి



# మానవ తప్పిదం వల్లే వేటపాలెం బ్లాస్టింగ్..!

- 21 మంది మృతి.. వేటపాలెం ఫైర్ వర్క్‌లో భీకర విస్ఫోటం
- ఫొరెన్సిక్ రిపోర్ట్ సంకేతాలు.. సల్ఫర్ ఒరిపిడి లేదా స్పార్క్ కారణమా?
- భద్రతా నిబంధనల ఉల్లంఘన.. ఒక్క షెడ్డులో 20 మందికి పైగా కార్మికులు
- ప్రభుత్వ చర్యలు వేగం.. యజమాని కుటుంబంపై కేసులు నమోదు

# ఖమేనీ ఖతం

- హైదరాబాదులో నల్ల దుస్తులు ధరించి రోడ్డెక్కిన షియా ముస్లింలు
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యపై హైదరాబాద్‌లో నిరసనలు
- అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ భారీ ర్యాలీ
- ఖమేనీ మృతికి సంతాపంగా ఇరాన్ కాన్సులేట్ వద్ద జెండా అవనతం



అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై హైదరాబాద్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆదివారం పాతబస్తీలోని షియా ముస్లింలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఖమేనీ మరణవార్త ధృవీకరణ కావడంతో పాతబస్తీలోని షియా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పురానీ హవేలీ, నూర్ ఖాన్ బజార్, దారుల్షా తదితర ప్రాంతాల్లో నల్ల దుస్తులు ధరించి, చేతిలో ఖమేనీ ఫొటోలు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు.

- మిగతా 2వ పేజీలో

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


# గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చ

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల రాష్ట్రాల పర్యటన ముగించుకుని ఢిల్లీకి రాగానే ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించనున్నారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో.. దేశ అత్యున్నత నిర్ణయాక వ్యవస్థ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్)తో ఆయన భేటీ కానున్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా వైమానిక దాడులు చేయడం, ఇదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల దృష్ట్యా భారత్ అప్రమత్తమైంది. రాజస్థాన్, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి పర్యటనలు ముగించుకుని రాత్రి 9:30 గంటల సమయంలో ప్రధాని ఢిల్లీ చేరుకుంటారు. వచ్చిన వెంటనే రక్షణ, హోం, విదేశాంగ, ఆర్థిక శాఖ మంత్రులతో కూడిన సీసీఎస్ బృందంతో సమావేశమవుతారు. ఈ అత్యవసర భేటీలో ప్రధానంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, భారత్‌పై వాటి ప్రభావం గురించి చర్చించనున్నారు. ముఖ్యంగా యూఏఈ, ఇతర గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రత, ఇంధన భద్రత (చమురు ధరలు), సముద్ర వాణిజ్య మార్గాల రక్షణ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అవసరమైతే భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు (ఎవాక్యుయేషన్) తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపైనా చర్చ జరగనుంది. అంతర్జాతీయంగా పరిస్థితులు వేగంగా మారుతున్న వేళ.. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు మోదీ సర్కార్ ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.

## మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు...

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్కడి ఎంబసీలతో టచ్‌లో ఉండాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బహ్రెయిన్‌లోని తెలుగువారి భద్రతపై ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆరా తీశారు. ఇరాన్ దాడుల నేపథ్యంలో బహ్రెయిన్‌లో ఆందోళన నెలకొంది. అక్కడ సుమారు 50 వేల మంది ఏపీ వాసులు ఉపాధి పొందుతుండగా, వారిలో అయ్యన్న సొంత నియోజకవర్గమైన నర్సీపట్నం వారే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారితో ఫోన్‌లో మాట్లాడిన స్పీకర్.. ధైర్యంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఏపీఎన్ఆర్టీఎస్ ద్వారా సాయం చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అయ్యన్న తెలిపారు. పరిస్థితి విషమిస్తే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మాట్లాడి.. తెలుగువారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

## అవి డీప్‌ఫేక్ వీడియోలు... ఇది వైసీపీ వాళ్ల పనే!

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో తనపై డీప్‌ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర జరుగుతోందని ఆరోపణ దీని వెనుక వైసీపీ నేతలు ఉన్నారని ఆగ్రహం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. కొందరు తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి తన రూపాన్ని అనుకరిస్తూ వీడియోలు తయారు చేసి, తనను వ్యక్తిగతంగా అప్రతిష్ట పాలుచేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ఈ మేరకు బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ కంటెంట్ మొత్తం అసత్యమైనది, వక్రీకరించినది. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పన్నిన పథకం ఇది. దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉంది. వైసీపీకి చెందిన కొందరు ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారు" అని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై చట్ట ప్రకారం ముందుకెళతానని స్పష్టం చేశారు. ఈ దుష్ప్రచారం వెనుక ఉన్న కుట్రను తేల్చాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వ్యక్తులను, దుష్ట శక్తులను వదిలే ప్రసక్తే లేదని బీఆర్ నాయుడు హెచ్చరించారు. దోషులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు. కాగా, వైసీపీ తన సోషల్ మీడియా ఖాతాలో ఇవాళ కొన్ని వీడియోలను పంచుకుంది. ఈ వీడియోలపైనే బీఆర్ నాయుడు తీవ్రంగా స్పందించారు.

## ఖమేనీ ఖతం

(మొదటి పేజీ తరువాయి)

తంజీమ్-ఎ-జాఫరీ సంస్థ పిలుపు మేరకు పురానీ హవేలీలోని మజార్-ఎ-ఇబ్నే-ఖతూన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు కంటతడి పెడుతూ నినాదాలు చేశారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడినందుకే ఖమేనీని పొట్టనబెట్టుకున్నారని, అగ్రరాజ్యాలకు తలొగ్గని నేతగా ఆయన నిలిచారని షియా మత పెద్దలు కొనియాడారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడమే ఈ విషాదానికి దారితీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఖమేనీ మృతికి సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద ఆ దేశ జాతీయ జెండాను అవనతం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పాతబస్తీలో ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం టెహ్రాన్‌లో తన నివాసంలోని కార్యాలయంలో ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మృతి చెందారని ఇరాన్ మీడియా వెల్లడించింది.

# దేశానికే ఆదర్శంగా అమరావతి జస్టిస్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

యూనివర్శిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కీలక విభాగాలన్నింటినీ ఒకే చోట ఇంటిగ్రేట్ చేస్తూ.. బెస్ట్ జుడిషయల్ సిటీని నిర్మిస్తామని తెలిపారు. ఈ బృహత్తర కార్యానికి సీజేఐ సహకారం కావాలని ఆయన కోరారు. అమరావతిలో 'నేషనల్ జుడిషియల్ అకాడమీ' ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన భూములు ఇవ్వడానికి, పూర్తి సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీజేఐకి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకునే సంప్రదాయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. తన తండ్రి కూడా గ్రామంలో పెద్దరికం వహించి, మధ్యవర్తిత్వం ద్వారా ఎన్నో సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ. 10 వేలు, ఒకవేళ కేసులు పరిష్కారం కాకపోయినా రూ. 3 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించారు. సత్వర న్యాయం అందడం వల్ల అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారని, వారి త్యాగంతోనే ఈ నిర్మాణం సాధ్యమవుతోందన్నారు. పర్యావరణ హితంగా, ఆర్థికంగా బలమైన రాజధానిగా ఉండాలనే లక్ష్యంతో.. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అంతకుముందు సదస్సుకు విచ్చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కు సీఎం చంద్రబాబు, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.




## ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం



"ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు, ఇరాన్ తన క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై దాడి చేశామని ప్రకటించుకుంది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ దరిదాపుల్లోకి కూడా రాలేదని కొట్టిపారేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌లో తాత్కాలిక పాలక మండలి ఏర్పాటైంది. అయతోల్లా అలిరెజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు. ఈ యుద్ధ ప్రభావం సామాన్యులపైనా తీవ్రంగా పడుతోంది. పాకిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద జరిగిన నిరసనల్లో 9 మంది మరణించారు. యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో విమానయాన రంగం కుదేలయ్యింది. భారత్ నుంచి వెళ్లాల్సిన 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. రష్యా, చైనా ఈ దాడులను ఖండించగా... పరిస్థితి ఇంకా ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

## డీసీసీల అధ్యక్షులకు నేడు రాహుల్ క్లాస్



హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం రాష్ట్రానికి రానున్నారు. గత పది రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరు కానున్నారు. శిక్షణ తీసుకున్న డీసీసీ అధ్యక్షులకు పార్టీ సంస్థాగత నిర్మాణం, వారి విధులు, పార్టీ ఆలోచనల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. అక్కడే రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యులను కలవనున్న రాహుల్ వారితో ఫొటో సెషన్‌లో పాల్గొననున్నారు. కాగా డీసీసీ అధ్యక్షుల కుటుంబ సభ్యులను కూడా ఈ శిబిరానికి ఆహ్వానించారు. వారితో కూడా మాట్లాడనున్న రాహుల్ ఫొటోలు సైతం దిగనున్నారు. వసీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో పాటు పీఏసీ సభ్యులు, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, సంగతన్ సృజన్ అభియాన్ జాతీయ ఇన్‌చార్జి చల్లా వంశీచందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, విశ్వనాథన్, సచిన్ సావంత్, టీపీసీసీ శిక్షణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొంటారు. ఏపీ నుంచి 41 మంది, తెలంగాణ నుంచి 36 మొత్తంగా 77 మంది డీసీసీ అధ్యక్షులు శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు.

పీసీసీ వర్గాలు వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం ఉదయం 7:10 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరనున్న రాహుల్‌గాంధీ 9:20 నిమిషాలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, మంత్రులు, పార్టీ నేతలు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఉదయం 9:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరనున్న రాహుల్‌గాంధీ 10 గంటలరే వికారాబాద్‌కు వచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హరిత రిసార్ట్‌కు చేరుకుంటారు. సాయంత్రం 4:30 గంటల వరకు శిక్షణ శిబిరంలో ఉంటారు. తిరిగి హెలికాప్టర్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని 5:30 గంటలకు ఢిల్లీ వెళ్తారు.

## మానవ తప్పిదం వల్లే వేటపాలెం బ్లాస్టింగ్..!

కాకినాడ జిల్లా వేటపాలెం శివార్లలోని 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' కేంద్రంలో శనివారం మధ్యాహ్నం సంభవించిన భీకర విస్ఫోటం పెను విషాదాన్ని మిగిల్చింది. పచ్చని పొలాల మధ్య బాణసంచా తయారీలో నిమగ్నమైన కార్మికులపై మృత్యువు ఒక్కసారిగా విరుచుకుపడింది. ఈ ప్రమాదంలో 21 మంది ప్రాణాలు కోల్పోగా, పలువురి పరిస్థితి ఇప్పటికీ విషమంగానే ఉంది. ఈ ఘోర ప్రమాదం కేవలం ఒక యాదృచ్ఛిక ఘటన కాదని, పూర్తిగా మానవ తప్పిదం , భద్రతా నియమాల ఉల్లంఘన వల్ల జరిగిన ఘోరమని అధికారిక వర్గాలు ప్రాథమికంగా నిర్ధారించాయి. మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో, భోజన సమయం కావడంతో కొంతమంది కార్మికులు బయటకు వెళ్లిన తరుణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యూనిట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భారీ స్థాయిలో నిల్వ ఉన్న బాణసంచా బాంబుల్లా పేలిపోయాయి. ఈ విస్ఫోటం ఎంత తీవ్రంగా ఉందంటే, దాని శబ్దం సుమారు ఐదు కిలోమీటర్ల మేర వినిపించడమే కాకుండా, సమీప గ్రామాల్లోని ఇళ్లపై కూడా ప్రభావం చూపింది. మృతదేహాలు తునాతునకలై 50 మీటర్ల దూరం వరకు గాలిలో ఎగిరి పొలాల్లో పడిపోయాయంటే పేలుడు తీవ్రత ఎంత భీకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దాదాపు 14 గంటల తర్వాత కూడా సంఘటనా స్థలంలో ఇంకా పొగలు వస్తూనే ఉన్నాయంటే నిల్వ ఉన్న మందుగుండు సామగ్రి ఎంత భారీగా ఉందో స్పష్టమవుతోంది. ఫోరెన్సిక్ నిపుణుల పరిశీలన ప్రకారం, ఈ విస్ఫోటానికి రెండు ప్రధాన కారణాలు ఉండవచ్చని తెలుస్తోంది. బాణసంచా తయారీలో కీలకమైన సల్ఫర్‌ను గొట్టాల్లో నింపి దట్టించే సమయంలో ఏదైనా చిన్నపాటి ఒరిపిడి జరిగి ఉండవచ్చు లేదా గాలిలో తేమ శాతం , రసాయనాల కలయికలో తేడా రావడం వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చు. మరో ప్రధాన వెర్షన్ ప్రకారం, బాంబులకు ఉండే వత్తులను కట్ చేసే కటింగ్ మిషన్ వద్ద కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వచ్చిన ఒక చిన్న నిప్పురవ్వ (రాజుఖుతీని), పక్కనే ఉన్న భారీ నిల్వలకు అంటుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ మానవ తప్పిదమే ప్రధాన పాత్ర పోషించిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిజానికి ఈ పరిశ్రమకు 2027 వరకు అనుమతులు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భద్రతా ప్రమాణాలను యజమాన్యం పూర్తిగా విస్మరించింది. నిబంధనల ప్రకారం ఒక షెడ్డులో కేవలం ఎనిమిది మంది మాత్రమే ఉండాల్సి ఉండగా, జాతరల కోసం వచ్చిన భారీ ఆర్డర్లను పూర్తి చేసే తొందరలో ఏకంగా 20 మందికి పైగా కార్మికులను ఒకే చోట కూర్చోబెట్టి పనులు చేయించారు. దీనివల్ల ప్రమాదం జరిగినప్పుడు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది.

## న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే.. ప్రజలకు సరైన న్యాయ జరుగుతుంది!

తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద నిర్మించనున్న 16 కోర్టు భవనాల సముదాయానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు అండ్ న్యాయవాదులు సహా పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. తిరుపతిలో కోర్టు భవనాల సముదాయ నిర్మాణం శుభసూచికమని తెలిపారు. కొత్త కోర్టులు నిర్మించబడటం ద్వారా న్యాయవ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రజలకు వేగంగా న్యాయం అందించే అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. 'తిరుపతిలో కోర్టు భవనాల సముదాయానికి శంకుస్థాపన శుభసూచికం. న్యాయ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది. నూతనంగా వచ్చే న్యాయవాదులు మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు తమకు న్యాయం జరగాలని కోర్టు మెట్లు ఎక్కుతారు. న్యాయవాదులు సరిగ్గా ఆలోచిస్తేనే వారికి సరైన న్యాయ జరుగుతుంది. అనారోగ్య సమస్య రాగానే నయమవుతుందన్న నమ్మకంతో ఆసుపత్రికి వెళుతారు. వైద్యులు ఇచ్చిన భరోసాతో తమకు బాగా అవుతుందని నమ్ముతారు. అలానే కోర్టుకు వచ్చామంటే తమకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని నమ్మకంతో రావాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

# యాదాద్రికి పోటెత్తిన భక్తులు






- దర్శనానికి 3 గంటలు.. శీఘ్ర దర్శనానికి గంట
- కిక్కిరిసిన క్యూలైన్లు.. క్షేత్రమంతా రద్దీ

**యాదగిరిగుట్ట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** ఆదివారం సెలవుదినం నేపథ్యంలో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. తెల్లవారుజాము నుంచే స్వామి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. గర్భగుడి, విష్ణు పుష్కరిణి, ఆలయ పరిసర ప్రాంతాలు, సాధారణ దర్శనం మరియు శీఘ్ర దర్శనం కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి. సాధారణ దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టగా, శీఘ్ర దర్శనానికి గంట సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. అరవై సంవత్సరాలు దాటిన వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి దేవస్థానం అధికారులు సౌకర్యాలు కల్పించారు. తులసి కాటేజీతో పాటు ఇతర వసతి గదులు నిండిపోవడంతో గదులు లభించని భక్తులు కొండకింద విష్ణు పుష్కరిణి సమీపంలోని డార్మెటరీ హాల్లో విశ్రాంతి తీసుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. దర్శనానంతరం భక్తులు విష్ణు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, లడ్డు, పులిహోర ప్రసాదాలను కొనుగోలు చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు.





## ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

- గాంధీ విగ్రహం సాక్షిగా ఉద్యమకారుల నిరసన
- కరీంనగర్ సభకు రాజాపేట నుంచి తరలిన జనం

**రాజపేట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని రాజపేట మండల తెలంగాణ సాధన ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ఆదివారం రాజపేట మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల అధ్యక్షుడు మారోజు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు పెంట సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై కమిటీ ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఉద్యమకారులను అధికారికంగా గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం రాజపేట మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించి నివాళు లర్పించారు. అలాగే కరీంనగర్‌లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఆహ్వానం అందుకున్న రాజపేట నాయకులు ప్రత్యేక వాహనంలో సభకు బయలుదేరారు. కార్యక్రమంలో కుమారస్వామి, పెంట సత్యనారాయణతో పాటు బిల్ల శ్రీను, నాగిర్తి రాజిరెడ్డి, బోళ్ల రాఘవరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, చింతల దాసు, శివశంకర్, వేముల గోపి, మంచాల స్వరూప, ఉచ్చెంతల బాలయ్య, కాయితి బాల్రెడ్డి, కలకుంట్ల పోచయ్య, రామిడి నరేందర్, బి. వాణి, ఆకిరెడ్డి నరసింహులు, నీల బిక్షపతి, జెల్ల వెంకటయ్య, బొడ్డు శంకర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకేనా.. సామాన్యుల వైద్యమేది?

- ప్రభుత్వ విధానాలపై తెలంగాణ జన ఫ్రంట్ ధ్వజం
- అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి
- యాదాద్రి జిల్లాలో పర్యటించిన స్టీరింగ్ కమిటీ

**రాజపేట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** భువనగిరి జిల్లాలో పర్యటించిన సందర్భంగా తెలంగాణ జన ఫ్రంట్ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆదివారం రాజపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ జన ఫ్రంట్ చైర్మన్ వలిగొండ విజయరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు సమగ్ర ఉచిత విద్యా, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ సౌకర్యాలపైనే దృష్టి సారిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1998 రకాల రోగాలకు ఉచిత వైద్యం అందించడం సరైన చర్యేనని, అయితే సాధారణ ప్రజల వైద్యం విషయంలో ప్రభుత్వం ఏమి చేస్తోందో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. భూటాన్ వంటి దేశాలు తమ పౌరులకు ఉచిత విద్య, వైద్యం అందిస్తున్నాయని పేర్కొన్నారు. లక్షల జీతాలు పొందుతున్న ఉద్యోగులకు సౌకర్యాలు కల్పిస్తూ పేద ప్రజలను విస్మరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. స్టీరింగ్ కమిటీ సభ్యుడు, పీపుల్స్ యూనియన్ ఫర్ లిబర్టీ అండ్ జస్టిస్ (పీయూఎల్జే) ఉపాధ్యక్షుడు చెందులాపురం భూపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కుల, మత ద్వేషంతో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్‌లో చిన్నారి మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బహుజన సైన్యం అధ్యక్షుడు పోలె విష్ణు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అందరికీ సమాన విద్య అందడం లేదని అన్నారు. పేదలు, ధనవంతుల పిల్లలు ఒకే పాఠశాలలో చదివే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్టీరింగ్ కమిటీ సభ్యుడు బండ్ల బుజ్జి బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం సమర్థంగా అమలు కావడం లేదని విమర్శించారు. మరో సభ్యుడు పెంట రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామపంచాయతీ కారోబారులు, గ్రామపంచాయతీ కార్మికులు, వెలుగు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి జిల్లాలోని విద్యావంతులు, ప్రజా సంఘాలు తెలంగాణ జన ఫ్రంట్‌లో చేరి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘీభావ ఉద్యమం రాష్ట్ర కమిటీ సభ్యుడు జంగా శ్రీకాంత్‌తో పాటు పెంట సత్యనారాయణ, మారోజు కుమారస్వామి, బల్దా చెంద్రయ్య, కొట్టకొండ వెంకటేష్ యోబు, మీసాల నర్సింగరావు, సమ్మయ్య, మల్లేశం, రాపాక కృష్ణ, రాపాక రమేష్ తదితరులు పాల్గొన్నారు.






## మురుగు సమస్యకు చెక్.. డ్రైనేజీ పనులు షురూ!

- దూది వెంకటాపురంలో పనుల ప్రారంభోత్సవం
- మెరుగుపడనున్న పారిశుద్ధ్యం - గ్రామ అభివృద్ధిలో మరో అడుగు

**రాజపేట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** మండల పరిధిలోని దూది వెంకటాపురం గ్రామంలో మురుగు కాల్వల (డ్రైనేజీ) నిర్మాణ పనులను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు ఈ పనులు చేపట్టినట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, ఉప సర్పంచి, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంట్రాక్టర్ గొడిషెల నగేష్ తదితరులు పాల్గొన్నారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే మురుగు నీటి సమస్య తొలగిపోతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## దేవాదాయ శాఖలో కొత్త బాట.. 'ధర్మవాణి' షురూ!

- సోమవారం డైరెక్టర్‌ను నేరుగా కలిసే అవకాశం
- సమస్యల పరిష్కారానికి అధికారుల నిర్ణయం
- కమిషనర్‌ను కలిసిన అర్చక జేఏసీ నేతలు



**హైదరాబాద్, మార్చి 1 (తొలివెలుగు న్యూస్):** దేవాదాయ శాఖలో ఉద్యోగులు, ఆలయాల సమస్యల పరిష్కారం కోసం ఇకపై ప్రతి సోమవారం 'ధర్మవాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ హనుమంతరావు ఆదేశాల మేరకు, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి డైరెక్టర్ కార్యాలయంలో అర్చకులు, ఉద్యోగులు, ఇతరులు తమ సమస్యలను నేరుగా డైరెక్టర్‌కు విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు. ధర్మబద్ధమైన సమస్యలను తక్షణమే లేదా వారం రోజుల్లో పరిష్కరిస్తామని డైరెక్టర్ హనుమంతరావు స్పష్టం చేశారు. కాగా, దేవాదాయ శాఖ కమిషనర్‌ను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ నేతలు కలిసి అర్చకుల పదోన్నతులు, గుర్తింపు కార్డులు, ఆలయ భూముల పరిరక్షణపై వినతిపత్రం అందజేశారు.



# పేదల సొంతింటి కల సాకారం


- రఘునాథపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశం
- పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

**రాజపేట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని రఘునాథపురం గ్రామం 5వ వార్డుకు చెందిన ఎంగలదాస్ సంధ్య-సిద్ధులు దంపతులు ప్రభుత్వం అందించిన రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లకు ఆదివారం గృహప్రవేశం చేశారు. ఈ వేడుకలో గ్రామ శాఖ అధ్యక్షుడు బింగి రమేష్, మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి గూడు కల్పిస్తోందని వారు వివరించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బింగి రమేష్, మాజీ సర్పంచ్ గాడిపెల్లి శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుక పెంటయ్య, ఉప సర్పంచ్ కలకుంట్ల కళ్యాణి రాజు, వార్డు సభ్యులు కటకం ప్రశాంత్, బల్ల హరీష్, కటకం గణేష్, ఎంగలదాస్ వెంకటేష్, బింగి గణేష్, బింగి సత్యనారాయణ, ఎంగలదాస్ యాదగిరి, చల్లూరి చిన్న పోషయ్య, గోలి కిరణ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యాదాద్రీశుడి సేవలో ఆర్టీఐ కమిషనర్, ఎమ్మెల్యే గండ్ర

- యాదాద్రిలో వేర్వేరుగా దర్శనాలు
- అర్చకుల ఆశీర్వచనం.. తీర్థ ప్రసాదాల పంపిణీ





**యాదగిరిగుట్ట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం పలువురు ప్రముఖులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సమాచార హక్కు శాఖ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వేర్వేరుగా ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు అతిథులను పూలమాలతో స్వాగతించి, గర్భగుడిలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు తాండూర్ వెంకటాచార్యులు, మాధవాచార్యులు, లక్ష్మణాచార్యులు, శ్రీధరాచార్యులు పాల్గొన్నారు. దేవస్థానం అధికారులు, ఏఈఓ రఘు సీతయ్య తదితరులు హాజరయ్యారు

# అక్రమ మద్యం స్వాధీనం.. ఇద్దరిపై కేసు

- రేణికుంట, బేగంపేట గ్రామాల్లో దాడులు.. మద్యం బాటిళ్ల సీజ్
- ఎస్ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు

**రాజపేట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** మండలంలోని రేణికుంట, బేగంపేట గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారంతో రేణికుంట గ్రామానికి చెందిన కోరుకొప్పుల ఆంజనేయులు నివాసంపై దాడి నిర్వహించి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే బేగంపేట గ్రామంలో నాగాయపల్లి హరినాథ్ వద్ద నుంచి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వీరిద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వివరించారు.






# మునుగోడులో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమిపూజ

- రూ.200 కోట్లతో మునుగోడులో సమగ్ర విద్యా ప్రాజెక్ట్
- 2,500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్య
- కులమతాలకు అతీతంగా కలిసి చదివే పాఠశాల
- రాష్ట్రవ్యాప్తంగా 79 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ప్రారంభం
- ప్రభుత్వ విద్య బలోపేతానికి తొలి అడుగు
- పేదలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
- రెండు లక్షల మంది విద్యార్థులకు లాభం
- రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయనున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే - ఎమ్మెల్సీ సమక్షంలో శిలాఫలక ఆవిష్కరణ



**మునుగోడు/ చౌటుప్పల్, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** నియోజకవర్గ కేంద్రంలోని దుబ్బ కాలువ రోడ్డులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్'కు భూమిపూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీజీఈడబ్ల్యూఐడీసీ సీఎండీ గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.200 కోట్ల వ్యయంతో 2,500 మంది విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం శుభపరిణామమని అన్నారు. చిన్ననాట తాము చదువుకునేటప్పుడు కులాల గురించి తెలియదని, అన్ని కులాల వారు ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేవారని గుర్తు చేశారు. ఇప్పుడు నిర్మించబోయే ఈ పాఠశాల కూడా కులమతాలకు అతీతంగా విద్య అందించే కేంద్రంగా నిలుస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 79 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభమవుతున్నాయని, వీటిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకోనున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పాఠశాలలు పూర్తయిన తర్వాత దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రస్తుతం 76 లక్షలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, వారిలో గణనీయమైన సంఖ్య ప్రైవేట్ రంగంలోనే ఉందన్నారు. కనీసం 50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివేలా చేయాలంటే బడ్జెట్‌లో 10-15 శాతం విద్యకు కేటాయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మునుగోడు నియోజకవర్గంలో 330 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, విద్యావ్యవస్థలో సమూల మార్పులు అవసరమని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా రాష్ట్ర రాజకీయాల్లో కీలక స్థానంలో ఉందని, మునుగోడు అభివృద్ధికి ఇది తొలి అడుగని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ..**

నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థాపన శుభపరిణామమని అన్నారు. పేద విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్య అందించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు అత్యవసరమన్నారు. విద్య, వైద్య రంగాలకు తగిన బడ్జెట్ కేటాయింపులు చేసి ప్రభుత్వ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# పునఃప్రారంభమైన స్వామివారి నిత్య కల్యాణాలు

- బ్రహ్మోత్సవాల ముగింపుతో పునరుద్ధరణ
- భక్తుల కోలాహలం.. పారవశ్యం

**యాదగిరిగుట్ట, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గత 11 రోజులుగా రద్దు చేసిన నిత్య కల్యాణ వేడుకలు ఆదివారం నుంచి తిరిగి ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పీఠంపై అధిష్టింపజేసి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, శ్రీనాథ్, లక్ష్మణాచార్యులు, అరుణ్ కుమార్, ఏఈఓలు రఘు, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల గుర్తింపునకు చట్టబద్ధ కమిటీ వేయాలి

- టీయూజేఏసీ ప్రధాన కార్యదర్శి: సంగీశెట్టి క్రిస్టఫర్

**వలిగొండ, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించడానికి చట్టబద్ధత కలిగిన కమిటీని ఏర్పాటు చేయాలని టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని, లేనియెడల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. కేవలం సబ్ కమిటీలతో సరిపెట్టకుండా, జుడిషియల్ చట్టబద్ధత కలిగిన కమిటీ వేస్తేనే అర్హులైన వారికి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉద్యమంతో సంబంధం లేని వారికి ప్రయోజనాలు చేకూరకుండా చూడాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## స్వామి గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలి

- దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- చౌటుప్పల్‌లో మొగుదాల కుటుంబానికి పరామర్శ



**చౌటుప్పల్, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్ తండ్రి, చౌటుప్పల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మామ మొగుదాల స్వామి గౌడ్ దశదినకర్మ కార్యక్రమం వలిగొండ రోడ్డులోని ఎస్.ఎం. రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరై స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## లింగోజిగూడెం పాఠశాలకు సీసీ నిఘా!

- దాతల ముందుచూపు.. భద్రతకు భరోసా
- విద్యార్థుల భద్రతకే ప్రాధాన్యం: కాంగ్రెస్ నేతలు







**చౌటుప్పల్, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పాఠశాల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. యువజన కాంగ్రెస్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కళ్లెం దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ సీసీ కెమెరాల ఏర్పాట్లు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించడమే కాకుండా విద్యార్థులు, సిబ్బంది భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం భద్రతా చర్యలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు మాధవ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండమీది వెంకటేష్, గూడూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# విద్యాదానమే మిన్న.. పైళ్ళ సేవలు అభినందనీయం

- శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల 20వ వసంతోత్సవం
- హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, దాత మల్లారెడ్డి
- ఒకే వేదికపై మాజీ ఎమ్మెల్యే రసమయి, అనిల్ కుమార్ రెడ్డి
- కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం
- గురువులకు సన్మానం.. విద్యార్థుల సందడి




**వలిగొండ, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** కళాశాల నిర్మాణానికి పైళ్ళ మల్లారెడ్డి చేసిన సేవలు అభినందనీయమని కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల 20వ వసంతాల వేడుకలను పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కళాశాల నిర్మాణ దాత పైళ్ళ మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రభుత్వ కాలంలో కళాశాల ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. ధనంతో ఎవరినైనా కొనవచ్చని, కానీ సరస్వతీ దేవిని కొనలేమని వ్యాఖ్యానించారు. కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిల్లో ఉన్నారని, వారు కళాశాల అభివృద్ధికి కృషి చేసి తమ రుణం తీర్చుకోవాలని సూచించారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడం అదృష్టంగా భావించాలన్నారు. విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రాంత విద్యార్థులకు పైళ్ళ మల్లారెడ్డి చేసిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. పూర్వ విద్యార్థులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకోవడంతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కళాశాల నిర్మాణ దాత పైళ్ళ మల్లారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో 2004లో రూ.2 కోట్ల 20 లక్షల వ్యయంతో కళాశాలను నిర్మించినట్లు తెలిపారు. ఇక్కడ చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం చేసి వివిధ హోదాల్లో కొనసాగుతున్నారని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డి, మండల విద్యాధికారి భాస్కర్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు మారగొని విష్ణు, నల్లమాస ధనుంజయ గౌడ్, యాట సంధ్య, మైసొల్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.






# మదర్ డైరీ కి పూర్వవైభవం



**రాజాపేట ,మార్చ్ 01(తొలివెలుగు న్యూస్) :** మదర్ డైరీ కి పూర్వ వైభవం వస్తుందని మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ పశు సంవర్ధక శాఖ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ,భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి లతో కలిసి గుజరాత్ లో నేషనల్ డైరీ డెవలప్మెంట్ చైర్మన్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల్లో మదర్ డైరీ ని హ్యాండోవర్ చేసుకొని 10 కోట్ల రూపాయల నిధులు ఇవ్వనున్నట్లు ఎన్డిడీపీ చైర్మన్ తెలిపినట్లు మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి తెలిపారు . రాష్ట్ర ముఖ్యమంత్రి కోరిక మేరకు మదర్ డైరీని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి ఎన్డిడిబి కృషి చేస్తామని అన్నట్టు తెలిపారు. మదర్ డైరీ పరిపాలన వ్యవహారాలు మదర్ డైరీ చూడగా ఎన్డిటివి మాత్రం ఆర్థిక వ్యవహారాలు మార్కెటింగ్ ఉన్నట్టు తెలిపారు .ఈరోజు చర్చలు సఫలం అవడం పట్ల మంత్రి వాకిటి శ్రీహరికి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారు .అతి త్వరలో రైతులకు పాల బిల్లులను అందజేయనున్నట్లు తెలిపారు .రైతుల అధైర్య పడవద్దు అని గతంలో మాదిరిగా మదర్ డైరీ పూర్వ వైభవంతో నడవడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎన్డిడీబీ సహకారంతో రైతులందరికీ న్యాయం చేసే విధంగా కృషి చేస్తుందని అన్నారు.



## నూతన కౌన్సిలర్లకు ఘన సన్మానం

అభివృద్ధికి కట్టుబడి ఉంటాం: కౌన్సిలర్ల హామీ

**చౌటుప్పల్, మార్చి 1 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన కౌన్సిలర్లను స్థానికులు ఘనంగా సన్మానించారు. 12, 13, 14, 18, 19 వార్డులకు చెందిన కౌన్సిలర్లు పాక చిరంజీవి యాదవ్, బత్తుల వాణి విప్లవ్ గౌడ్, ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్‌లను మండల యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి మార్గం నరసింహ - వసంత దంపతులు, కాలనీవాసులు శాలువాలతో సత్కరించి, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో వర్కాల కుమార్, చివగొని వెంకటేష్ గౌడ్, తొర్పునూరి బాబు, గుయ్యని జంగయ్య, చెరుకు అశోక్, చెవగొని రమేష్ గౌడ్, మార్గం స్వామి, ఎర్రసాని శేఖర్, లింగస్వామి, వంటల రవి, బెల్లి కృష్ణ, బోదుల మురళి తదితరులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# గుండె తరుక్కుపోయింది

తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వరుస సినిమాలతో దూసుకుపోతున్న మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్. . కంటెంట్ ఉన్న చిత్రాలనే సెలెక్ట్‌చేసుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇటీవల 'లాక్‌డౌన్ణ మూవీతో అలరించిన అనుపమ.. ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణ్ణం ప్రాజెక్టులో బిజీగా ఉంది. ఇందులో తరుణ్ భాస్కర్, రాజు వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉద్దెమారి, వీకే నరేష్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బద్రప్ప గాజుల తెరకెక్కిస్తున్న ఈ సినిమాను బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇక సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉండే అనుపమ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితంలో జరిగిన ఓ చేదు జ్ఞాపకాన్ని గుర్తుచేసుకుంది. 'కార్తికేయ-2ణ షూటింగ్ టైంలో సెట్‌లో ఒక చిన్న మేకపిల్ల ఉండేది. ఖాళీ సమయాల్లో దానితో ఎంతో ఇష్టంగా ఆడుకునేదాన్ని. అయితే ఒకరోజు షూటింగ్ లంచ్‌బ్రేక్‌లో మాకు మటన్ బిర్యానీ వడ్డించారు. నేను తింటున్న సమయంలో నా అసిస్టెంట్ వచ్చి ఒక షాకింగ్ న్యూస్ చెప్పాడు. 'మేడం, మీరు ఇప్పుడు తింటున్నది మీరు ఇందాక ఆడుకున్న మేకపిల్లన్ణే అంటూ నవ్వుతూ చెప్పాడు. ఆ మాట వినగానే ఒక్కసారిగా గుండె తరుక్కుపోయింది. అక్కడికక్కడే వాంతులు చేసుకున్న. ఆ విషయం నన్ను మానసికంగా ఎంతో గాయపరిచింది. అప్పటినుంచి నేను మటన్ ముట్టుకోవడమే మానేశా. 'కార్తికేయ-2ణ షూటింగ్ పూర్తయినప్పటి నుంచి దాదాపు ఇన్నేళ్ల పాటు నేను మాంసాహారానికి దూరంగా ఉన్న అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అనుపమ చేసిన ఈ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.



## సమానత్వం అనేది ఎజెండా కాదు..
# అది మన హక్కు

లింగ సమానత్వం, సామాజిక బాధ్యతలపై ప్రముఖ బాలీవుడ్ నటి షెఫాలీ షా చేసిన సంచలన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఒక ఈవెంట్‌లో భాగంగా షెఫాలీ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా ఉండటం అనేది ఏదో ఒక పట్టుదలతో సాధించాల్సిన 'ఎజెండా' కాదని, మనకు నచ్చినట్లుగా, సౌకర్యంగా జీవించడమే అసలైన సమానత్వమని షెఫాలీ షా అన్నారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడటం చాలా కీలకమని పేర్కొన్న ఆమె, ముఖ్యంగా చదువు మరియు ఆర్థిక స్వతంత్రత ఉంటేనే సమాజంలో మహిళలకు ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని నొక్కి చెప్పారు. పిల్లల పెంపకం గురించి మాట్లాడుతూ.. ఆ బాధ్యత కేవలం తల్లులదే కాదని, ఇందులో తండ్రుల పాత్ర కూడా సమానంగా ఉండాలని ఆమె అన్నారు. తండ్రి ఇంట్లోని మహిళలతో ఎలా ప్రవర్తిస్తున్నాడో చూసే పిల్లలు ప్రవర్తనను నేర్చుకుంటారని, అందుకే అబ్బాయిలను చిన్నప్పటి నుంచే మహిళల పట్ల గౌరవంగా ఉండేలా పెంచాలని ఆమె సూచించారు. మహిళల భద్రత అనేది కేవలం చట్టాల ద్వారానే కాకుండా, ఇంట్లోని సంస్కృతి నుంచే ప్రారంభం కావాలని ఆమె కోరారు. ప్రస్తుతం 'ఢిల్లీ క్రైమ్', 'డార్లింగ్స్' వంటి సక్సెస్‌లతో కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్న షెఫాలీ షా, త్వరలో 'లవ్ అండ్ వార్' వంటి భారీ చిత్రంలో నటిస్తుంది.



మాస్ మహారాజా రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రానికి ఓటీటీ రిలీజ్‌కు లైన్ క్లియర్ అయింది. 2026 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న భారీ అంచనాల మధ్య థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. పండగ సీజన్‌లో భారీ సినిమాల పోటీ కారణంగా ఈ చిత్రం 'బిలో యావరేజ్' టాక్‌తో సరిపెట్టుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలో రిలీజ్ డేట్ విషయంలో చాలా కాలం నుండి సస్పెన్స్ కొనసాగుతూ వస్తుంది. మొదటగా ఈ సినిమా ఫిబ్రవరి 13న ఓటీటీలో విడుదల కావాల్సి ఉండగా, సాంకేతిక కారణాల వల్ల స్ట్రీమింగ్ వాయిదా పడింది. ఆ తరువాత ఫిబ్రవరి 27, మార్చి 6 అంటూ పలు తేదీలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే తాజాగా ఈ చిత్రానికి డిజిటల్ హక్కులు దక్కించుకున్న జీ5 ప్లాట్‌ఫామ్ మార్చి 13 నుంచి స్ట్రీమింగ్ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. దీంతో రవితేజ అభిమానుల్లో మరోసారి ఉత్సాహం నెలకొంది. ప్రేమకథా చిత్రాలకు పేరున్న దర్శకుడు కిషోర్ తిరుమల ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో రవితేజ ఒక సంపన్న వ్యాపారవేత్త పాత్రలో కనిపించారు. వ్యాపార పనుల నిమిత్తం తరచుగా యూరప్‌కు వెళ్లే ఆయన, అక్కడ ఓ యువతితో పరిచయం పెంచుకుంటాడు. ఆ పరిచయం ప్రేమగా మారడంతో అతని వైవాహిక జీవితంలో సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడతాయి. ఆ భావోద్వేగ సంఘర్షణలను, కుటుంబ బంధాలను, సంబంధాల విలువను దర్శకుడు వినోదాత్మకంగా మేళవించి చూపించారు. కామెడీతో పాటు ఎమోషనల్ డ్రామా కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో ఆశికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరి పాత్రలు కథకు కీలకంగా నిలిచాయి. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో చూడాలని ఆసక్తిగా ఉన్నారు. రవితేజ మార్క్ కామెడీ, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో కూడిన ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై మంచి ఆదరణ పొందుతుందని మేకర్స్ భావిస్తున్నారు.

# భర్త మహాశయులకు విజ్ఞప్తి'
# ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..



# మోదీగారు.. నన్ను క్షేమంగా భారత్‌కు తీసుకురండి

ఇరాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్, బహ్రెయిన్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లలో ఉన్న భారతదేశ ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయం గుప్పిట్లో బతుకుతున్నారు. దుబాయ్‌లో టాలీవుడ్ హీరో మంచు విష్ణుతో పాటు బాలీవుడ్ నటి సోనాల్ చౌహాన్ కూడా చిక్కుకుపోయింది. విమాన రాకపోకలు నిలిపివేయడంతో తిరిగొచ్చే దారి కనిపించడం లేదని సోషల్ మీడియాలో వాపోయింది. గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీగారు.. ప్రస్తుత సంక్షభ పరిస్థితుల్లో నేను దుబాయ్‌లో చిక్కుకున్నాను. విమానాల రాకపోకలు ఆగిపోయాయి. ఇండియాకు ఎలా రావాలో తెలియడం లేదు. నేను సురక్షితంగా ఇంటికి చేరేందుకు ప్రభుత్వం సాయం చేయాలని కోరుతున్నాను అంటూ చేతులు జోడించి నమస్కరిస్తున్న ఎమోజీని జత చేసింది సోనాల్. సోనాల్ చౌహాన్ మోడల్, సింగర్, హీరోయిన్. జన్నత్ చిత్రంతో హిందీలో, రెయిన్‌బో మూవీతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. లెజెండ్, పండగ చేస్కో, షేర్, సైజ్ జీరో, డిక్టేటర్, ఎఫ్ 3, ద ఘోస్ట్ వంటి చిత్రాల్లో నటించింది. తెలుగులో చివరగా ఆదిపురుష్ మూవీలో మండోదరిగా యాక్ట్ చేసింది. చివరగా దర్ద్ (2024) అనే ద్విభాషా చిత్రంలో తళుక్కుమని మెరిసింది.



